

ఛక ఛక గుర్రం చలాకి గుర్రం
చెంగున దూకే చక్కని గుర్రం
పదవే గుర్రం భళారె గుర్రం
పరుగులెత్తేటి బంగరు గుర్రం
అన్నయ గారో అద్భుత గుర్రం
పంచకళ్యాణి గుర్రం
అల్లరి గుర్రం ఎల్లరి గుర్రం
పిల్లల షికారు గుర్రం
ఆగడం తెలీని ఆ గుర్రానికి
అక్కయ్యాగారో కళ్లెం!
గులాబి పువ్వుల గొళ్లెం!
మాగడ తరకల గులాబి రేకుల
గిల్లి గిచ్చి కితకిత పెట్టే
సన్నా సన్నని గులాబి ముల్లుల
పిల్లల నవ్వుల పన్నీట జల్లుల
అన్నయగారూ అక్కయగారూ
ఎక్కుపెట్టిన నవ్వుల విల్లుల
ఎన్నో ఎన్నో ఎన్నో రంగె రంగుల
హహహహా! హరివిల్లుల!

— ము. రమణ

# అక్కయ్యా, రావూ...?

## శ్రీ ముళ్ళపూడి రమణ

రేడియో అక్కయ్యకి

బుడుగు నమస్కరించి వ్రాసేది.

చిన్న పిల్లలందర్నీ దేముడు తనే దగ్గరుండి పెంచాలను కున్నాట్ట- కానీ పాపం అన్ని చోట్లా వెళ్ళడానికి టైము చాలక అమ్మల్నీ నాన్నల్నీ తన ఏజెంట్లుగా పంపించాట్ట-ఇలాని బామ్మ చెప్పిందిలే. మళ్ళీనేమో పిల్లలకి అన్నంపెట్టి బళ్లో పడేసి పెంచెయ్యడం చాలదు గదా. అసలు పెంచడం అంటే ఈ పెద్దవాళ్ళకి తెలీదుగదా పాపం. కుంచెం బోల్టు ఖదలు పాటలూ ఆటలూ జోకులూ చెప్పాలిగదా – వాళ్ళని నవ్వించాలి గదా! ఆడించాలి గదా. అందుకోసం దేముడు అన్నయ్యల్నీ అక్కయ్యల్నీ పంపించాట్ట. అయితే మామూలు అన్నయ్యలూ అక్కయ్యలూ వాళ్లూ తమ్ముళ్ళనీ చెల్లాయిలనీ ఏడిపించుతారు గానీ అడించరు గదా. వాళ్ళకి సిగరెట్టులు తేడానికీ లౌ లెటర్సులు తీసుకెళ్ళి రెండు జెళ్ళ సీతల కివ్వడానికీ–వాళ్లు రోడ్డుమీద వెళ్తుంటే ఈల వేసిపెట్టడానికి మాత్రం 'దామ్మా తమ్ముడూ' 'దామ్మా చెల్లాయి' అంటారు. ఉత్తప్పుడేమో 'పోరా న్యూసెన్సూ' అని నెత్తిమీద వీపుమీద ప్రైవేటు చెప్పేస్తారు. అలాంటి వాళ్ళకి ప్రైవేటు చెప్పటానికోసం, దేవుడు మెద్రాసులో మిమ్మల్నీ రేడియో అన్నయ్యనీ పంపించాట్ట. అప్పుడు ఆ రోజుల్లో మెద్రాసులో పుట్టిన పెరిగిన తెలుగు పిల్లలు ఎంత లక్కీయో గదా. మీరు మాకెన్ని ఖదలు చెప్పారో–మా చేత ఎన్ని చెప్పించారో, ఎన్ని పాటలు పాడించారో–ఎన్ని నాటకాలు ఆడించారో–ఎన్ని టిఫిన్సులు చాక్లెట్సులూ బుక్సులూ బొమ్మలూ కొనిపెట్టారో గదా. ఇంట్లో అమ్మలూ నాన్నలూ అక్కలూ అన్నలూ బళ్లో మేస్టర్లూ ఆ డ్రోజులసేపు మా బుర్రలమీద వీపుల మీద చెవిలమీద చెప్పిన ప్రైవేట్లన్నీ మర్చిపోయేలా–ఆదివారంనాడు మీరిద్దరూ మమ్మల్ని ఆడిపించే వాళ్లుగదా. మీ చుట్టూ పరిగెట్టి మేమెన్నో దాగుడు మూతలాడుకున్నాం గదా. ఆడుతూ పాడుతూనే బోల్డు చదువు పాఠాలు కూడా మాజిక్కులా నేర్చేసుకున్నాం గదా. అబ్బ! ఎంత చక్కగా ఉండేది అప్పుడు! ఇప్పుడు ఈ చిన్నచిన్న బుడుగులకీ సీగాన పెసూనాంబలకీ మీ ఖదలు చెప్తె నమ్మటంలేదు. కొయ్ కొయ్ అంటున్నారు. అన్నీ పచ్చి ఖదలు అంటున్నారు. వాళ్ళని నమ్మించటానికైనా మళ్ళీ రావా అక్కయ్యా!

ఇట్లు

బుడుగు